

## నూతన ఆవిష్కరణల అడ్డాగా హైదరాబాద్

### రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): నూతన ఆవిష్కరణలకు ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్ తన స్థానాన్ని సుస్థిరపరుచుకుంటున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఎవర్‌నార్త్ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ హబ్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ జీసీసీ సెంటర్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కల్పించనున్నదని, దీంట్లోభాగంగా తొలి విడుత వెయ్యి మంది ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలను లభించనున్నాయని, ఈ ఆధునిక కేంద్రం హైదరాబాద్‌లోని నిపుణుల సామర్థ్యాన్ని వినియోగించుకొని ఆరోగ్యరంగంలో ఐటీ వినియోగాన్ని మరింత విస్తృతపరుస్తున్నదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. భారత్‌లో ఏర్పాటు చేసిన తొలి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఇదేనన్నారు. బెంగళూరుకు చెందిన సిగ్నా హెల్త్ సొల్యూషన్స్‌తో కలిసి భారత్‌లో డాటా, అనలిటిక్స్ సేవలు అందిస్తున్నది. ఈ భాగస్వామ్యం ద్వారా ఎవర్ నార్త్ 1.9 కోట్ల మంది భారతీయులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నది. 30కి పైగా దేశాల్లో కార్యకలాపాలను విస్తరించిన ఎవర్‌నార్త్‌లో ప్రస్తుతం 75 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

# హైదరాబాద్ ఆఫీస్‌కు గిరాకీ నై

### తగ్గిన కొత్త ఆఫీస్ స్పేస్ సప్లై, లీజింగ్

### 25 శాతం చొప్పున పతనం

### జూలై-సెప్టెంబర్‌కుగాను వెస్టియన్ నివేదిక

***తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు పదేండ్లపాటు అత్యధిక డిమాండ్‌ను చూసిన హైదరాబాద్ రియల్టీకి ఇప్పుడు ఆదరణే కరువైపోయింది.***

***అటు హౌజింగ్ మార్కెట్, ఇటు ఆఫీస్ మార్కెట్ రెండూ కుప్పకూలుతున్నాయి మరి. ఎన్నో ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీలు విడుదల చేస్తున్న వరుస నివేదికలే ఇందుకు నిదర్శనం.***

***తాజాగా దేశీయ రియల్టీపై అందులో హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ తీరుతెన్నులపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ ఓ రిపోర్టునిచ్చింది. ఇందులో ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఆఫీస్ స్పేస్ సప్లై, లీజింగ్ 25 శాతం పడిపోయినట్టు తేలింది.***

న్యూఢిల్లీ, నవంబర్ 19: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పరుగులకు బ్రేక్ పడిందా?.. సుమారు దశాబ్దకాలం కనిపించిన డిమాండ్ ఇప్పుడు కనుమరుగైపోతున్నదా?.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. కన్సల్టెన్సీ ఏదైనా.. చెప్పేది మాత్రం ఒక్కటే. అదే.. హైదరాబాద్ నిర్మాణ రంగంలో నిస్తేజం ఆవరిస్తున్నదని. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా నివేదిక సైతం ఇదే చెప్తున్నది. మంగళవారం వచ్చిన ఈ రిపోర్టు.. హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంతమాత్రంగానే ఉన్నట్టు తేల్చింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో మార్కెట్‌లోకి కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఆఫీస్ స్పేస్ గతంతో చూస్తే 25 శాతం తగ్గినట్టు పేర్కొన్నది. 4.1 మిలియన్ చదరపు అడుగులకే పరిమితమైనట్టు స్పష్టం చేసింది. అలాగే ఇదే సమయంలో లీజింగ్ కార్యకలాపాలు సైతం 25 శాతం క్షీణించి 2.79 మిలియన్ చదరపు అడుగుల వద్దే ఉన్నట్టు వెల్లడైంది.

**రివర్స్ గేర్‌లో..**

దేశవ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలకు తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందు గుర్తొచ్చేది హైదరాబాద్. ఒకప్పుడు బెంగళూరు, ముంబైలకు ఈ ఘనత దక్కినా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో సుమారు పదేండ్లపాటు అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అందించిన సహకారంతో ఆ నగరాల స్థానంలోకి హైదరాబాద్ వచ్చి చేరింది. ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, ఫార్మా, బయోసైన్స్, ఏవియేషన్, డాటా సెంటర్లు ఇలా అన్నింటికీ హైదరాబాదే ప్రధాన కేంద్రంగా విరాజిల్లింది. కానీ ఇప్పుడు ఆ ఉత్సాహం సన్నగిల్లింది. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆఫీస్ స్పేస్ సప్లై కూడా అందుకు తగ్గట్టుగానే తగ్గుతూ వస్తున్నది. దీనిపై రియల్టీ వర్గాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి.

**ఢిల్లీ, బెంగళూరుల్లో..**

ఓ వైపు హైదరాబాద్‌లో కొత్తగా వచ్చే ఆఫీస్ స్పేస్ క్షీణిస్తుంటే.. మరోవైపు బెంగళూరు, ఢిల్లీల్లో అది పెరుగుతూపోవడం గమనార్హం. ఈ జూలై-సెప్టెంబర్‌లో బెంగళూరులో అందుబాటులోకి వచ్చిన నూతన ఆఫీస్ స్పేస్ 3.6 మిలియన్ చదరపు అడుగులు. గతంతో పోల్చితే 33 శాతం ఎక్కువ. అలాగే ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనూ 2.3 మిలియన్ చదరపు అడుగులకు ఎగిసింది. మునుపటితో చూస్తే ఇది ఏకంగా 360 శాతం పెరగడం విశేషం. ముంబైలో 0.90 మిలియన్ చదరపు అడుగులతో యథాతథంగా కొత్త ఆఫీస్ స్పేస్ సరఫరా ఉన్నది. చెన్నైలో స్వల్పంగా తగ్గగా, కోల్‌కతాలో ఏ-గ్రేడ్ ఆఫీస్ స్పేస్ సప్లైనే లేదని వెస్టియన్ చెప్పింది. పుణెలో మాత్రం 26 శాతం తరుగుదల కనిపించింది. దీంతో హైదరాబాద్‌సహా దేశంలోని ఈ ఏడు ప్రధాన నగరాల్లో ఓవరాల్‌గా మార్కెట్‌లోకి కొత్త ఆఫీస్ స్పేస్ రాక 4 శాతం పడిపోయి జూలై-సెప్టెంబర్‌లో 12.8 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైనట్టు వెస్టియన్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.



**లీజింగ్‌లో..**

ఈ జూలై-సెప్టెంబర్‌లో బెంగళూరులో లీజింగ్ కార్యకలాపాలు 84 శాతం ఎగిసి 6.63 మిలియన్ చదరపు అడుగులకు చేరుకున్నాయి. పుణెలో 112 శాతం పెరిగి 2.33 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైంది. చెన్నైలో లీజింగ్ కార్యకలాపాలు యథాతథంగానే ఉండగా, ముంబైలో స్వల్ప క్షీణత కనిపించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 17 శాతం, కోల్‌కతాలో 45 శాతం తగ్గాయి. ఇక బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాల్లో డిమాండ్ ఉన్నట్టు వెస్టియన్ చెప్తున్నది.

# ఇక బ్యాంకుల వంతు

### నాలుగు బ్యాంకుల్లో వాటా విక్రయించే దిశగా కేంద్రం




న్యూఢిల్లీ, నవంబర్ 19: ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వాటాను విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. సెబీ మార్గదర్శకాలకు లోబడి నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వాటాను విక్రయించబోతున్నది. వీటిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంకులు ఉన్నాయి. వీటిలో సెంట్రల్ బ్యాంక్‌లో కేంద్రానికి 93 శాతం వాటా ఉండగా, ఇండియన్ ఓవర్‌సీస్‌లో 96.4 శాతం, యూకోలో 95.4 శాతం, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లో 98.3 శాతం వాటా ఉన్నది. మార్కెట్ రూల్స్ ప్రకారం స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల్లో పబ్లిక్ షేరుహోల్డర్లు 25 శాతం వాటా కలిగివుండాలనే నిబంధనకు అనుగుణంగా కేంద్రం ఈ వాటాలను విక్రయించడానికి సిద్ధమైంది. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్న ఈవాటాను ఎప్పటిలోగా, ఎంత శాతం వాటా విక్రయించేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

## అర్వతో ప్యూర్ ఈవీ ఒప్పందం

హైదరాబాద్, నవంబర్ 19: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విక్రయ సంస్థ ప్యూర్ ఈవీ.. అంతర్జాతీయ మార్కెట్‌పై దృష్టి సారించింది. మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాల్లో తన వాహనాలను విక్రయించడానికి అర్వ ఎలక్ట్రిక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. అక్కడి మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి డిస్ట్రిబ్యూషన్, ఎలక్ట్రిక్ మోటర్‌సైకిళ్లను విక్రయించడానికి ఈ ఒప్పందం దోహదం చేయనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందంలో భాగంగా వచ్చేరెండేండ్లలో 50 వేల యూనిట్ల ఎకోడ్రైఫ్ట్, ఈట్రైస్ట్ ఎక్స్ మోటార్‌సైకిళ్లను సరఫరా చేయనున్నది.

## రెడ్డీస్ ప్లాంట్‌పై యూఎస్ అభ్యంతరాలు

హైదరాబాద్, నవంబర్ 19: ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు అమెరికా నియంత్రణ మండలి గట్టి షాకిచ్చింది. హైదరాబాద్‌కు సమీపంలోని బొల్లారం వద్ద ఉన్న ప్లాంట్‌ను అమెరికా హెల్త్ రెగ్యులేటరీ తనిఖీ చేసి ఏడు అభ్యంతరాలతో ఫామ్ 484 జారీ చేసిందని సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. బొల్లారం వద్ద ఉన్న ఏపీఏ తయారీకేంద్రం(సీటీవో-2)ను నవంబర్ 13 నుంచి 19 వరకు తనిఖీ చేశారు.

# గోల్డ్ లోన్లకూ ఈఎంఐలు

### పరిచయం చేసే యోచనలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు

### రుణాల మంజూరులో లోపాల్ని గుర్తించిన ఆర్బీఐ



న్యూఢిల్లీ, నవంబర్ 19: గోల్డ్ లోన్లకూ త్వరలో ఈఎంఐలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా తదితర రుణాలకే నెలవారీ వాయిదా చెల్లింపుల (ఈఎంఐ) సౌకర్యం ఉన్నది. బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే అప్పులకు ఈ సదుపాయం లేదు. అయితే ఈ రుణాల మంజూరులో ఆర్బీఐ రకరకాల లోపాలను గుర్తించింది. దీంతో బ్యాంకులు, గోల్డ్ లోన్ కంపెనీల వంటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు బంగారంపై రుణాలకూ ఈఎంఐలను తేవాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

**ఇదీ సంగతి..**

బంగారు ఆభరణాలను తనఖా పెట్టి తీసుకునే రుణాల్లో లోపాలను గుర్తించామని ఈ సెప్టెంబర్ 30న ఓ సర్క్యులర్‌లో ఆర్బీఐ తెలిపింది. విలువ, పరిశీలన, రుణగ్రహీత ఆర్థిక సామర్థ్యం, వేలం వంటి అంశాల్లో బ్యాంకులు, రుణదాతలు నిర్లక్ష్యం చేస్తున్నారన్నది. తీసుకున్న అప్పును తిరిగి చెల్లిస్తారా? లేదా? అన్నది చూడాలని ఆర్బీఐ అంటున్నది. దీంతో ఈఎంఐ ఆధారిత వ్యవస్థను గోల్డ్ లోన్లకూ తేవాలనుకుంటున్నట్టు బ్యాంకర్లు చెప్తున్నారు. కాగా, సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకులు రూ.1.4 లక్షల కోట్ల గోల్డ్ లోన్లను ఇచ్చాయి. గతంతో పోల్చితే 51 శాతం పెరిగాయి.

## హైదరాబాద్‌లో జెప్టో కేఫ్

న్యూఢిల్లీ, నవంబర్ 19: ఈ-కామర్స్ జెప్టో తాజాగా కేఫ్ సర్వీసులను కూడా ప్రారంభించింది. ప్రస్తుతం ముంబై, ఢిల్లీ, బెంగళూరుల్లో 120 కేఫ్స్‌లను ఏర్పాటు చేసిన సంస్థ..త్వరలో హైదరాబాద్‌లో అడుగపెట్టబోతున్నట్లు ప్రకటించింది. 2026 నాటికి కేఫ్ వ్యాపారం ద్వారా రూ.1,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. అందుకు తగ్గట్టుగానే తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నట్లు జెప్టో సీఈవో అదిత్ పాలిచా తెలిపారు. పది నిమిషాల్లో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించే సర్వీసులకు అనూహ్యంగా స్పందన లభించిందని, ఇదే క్రమంలో గతేడాదిగా మా బృందం కేఫ్‌ల కోసం ఎంతో పరిశోధన చేశారని, చేతితో తయారు చేసిన బ్రూయింగ్ టెక్నికల్‌ను ఉపయోగించి కాఫీను తయారు చేసే యంత్రాలను సేకరించినట్లు, తద్వారా కస్టమర్లకు కాఫీని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కేఫ్ సర్వీసుల్లో 148 ఐటమ్స్‌ను అందిస్తున్నట్లు, బుకింగ్ చేసుకున్న పది నిమిషాల్లో ఇస్తున్నామన్నారు.

# వరుస పతనాలకు బ్రేక్

### సెన్సెక్స్ 239, నిఫ్టీ 65 పాయింట్ల లాభం

ముంబై, నవంబర్ 19: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. బ్యాంకింగ్, ఐటీ, వాహన షేర్ల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడైనప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయి. వరుసగా నాలుగు రోజులుగా నష్టపోయిన సూచీలు ప్రారంభం నుంచే లాభాల బాట పట్టాయి. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 239.37 పాయింట్లు అందుకొని 77,578.38 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ ఏడు రోజుల పతనం నుంచి లాభాల్లోకి మళ్లింది. మార్కెట్ ముగిసే సమయానికి 64.70 పాయింట్లు అందుకొని 23,518.50 వద్ద స్థిరపడింది. గత ఏడు సెషన్లలో నిఫ్టీ 1,030 పాయింట్లు లేదా 4.3 శాతం పతనం కాగా, సెన్సెక్స్ 3,000 పాయింట్లు తగ్గి 77,300కి పడిపోయిన విషయం తెలిసిందే. ఎఫ్ఐఐలు అమ్మకాలకు మొగ్గుచూపడం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు, అమెరికా బాండ్ ఈల్డ్ బలపడటం సూచీల పతనానికి ప్రధాన కారణాలు. మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, టాటా మోటర్స్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడగా..రిలయన్స్, ఎస్బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతి, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి.



# హత్య కుట్రపై సమగ్ర విచారణ చేయాలి

- **కుట్రదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**
- **పోలీసులకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఫిర్యాదు**




పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మంథని, నవంబర్19: తనను హత్య చేసేందుకు కుట్ర జరిగినట్లు కాటారం మాజీ జడ్పీటీసీ, బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ చేయాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పోలీసులను కోరారు. ఈ మేరకు మంగళవారం పుట్ట మధు తరుపున బీఆర్‌ఎస్ నాయకులు పెద్దపల్లి జిల్లా మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 17న చల్ల నారాయణరెడ్డి ఒక వీడియో విడుదల చేశారని, అందులో తనను హత్య చేసేందుకు మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, ఆయన సోదరుడు శ్రీను బాబు కుట్ర చేశారని అందులో పేర్కొన్నారు. తాను కనుకునూరు వెళ్తున్నాననే సమాచారం చల్లా నారాయణరెడ్డికి తెలిపి, తన హత్యకు పథకం రచించి, సుమారు 70 మందితో కలిసి బయలుదేరగా మార్గం మధ్యలో జరిగిన ప్రమాదంతో తాను వెనక్కి తగ్గినట్లు వీడియోలో నారాయణరెడ్డి వెల్లడించినట్లు తెలిపారు. అయితే, ఈ వీడియోలో ఎన్నడు కుట్ర చేశారో, కనుకునూరు ఎన్నడు వెళ్లారనే విషయాలను వెల్లడించలేదని, ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేస్తే వాస్తవ విషయాలతో పాటు కుట్రదారులు ఎవరనేది తెలుస్తుందన్నారు. సమగ్ర విచారణ చేసి తన హత్య కుట్రలో భాగస్వాములైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్ గౌడ్, నాయకులు తగరం శంకర్ లాల్, శ్రీనివాస్ యాదవ్, జంజర్ల శంకర్, కాయితి సమ్మయ్య, మంథని లక్ష్మణ్, వేల్పుల గట్టయ్య, లోడారి రాములు ఉన్నారు.

## వరి కొయ్యలు కాల్చవద్దు

జూలపల్లి, నవంబర్ 19 : వరి కోసిన తర్వాత రైతులు కొయ్యలు కాల్చవద్దని ఏవో ప్రత్యూష సూచించారు. జూలపల్లిలో కోసిన వరి క్షేత్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. వరి కొయ్యలు కాల్చితే భూసారం తగ్గుతుందని, పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. రైతు నాయకులు నాడెం మల్లారెడ్డి, కూసుకుంట్ల వెంకటరెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

రామగిరి, నవంబర్ 19: కోతల తర్వాత వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల అనేక నష్టాలు ఉన్నాయని ఏవో చిందం శ్రీకాంత్ సూచించారు. మండలంలోని కల్వచర్లలో మంగళవారం రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈవో అరవింద్, రైతులు పాల్గొన్నారు.

## ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

పెద్దపల్లి కమాన్, నవంబర్ 19 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి ట్రినిటి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఝాన్సీ లక్ష్మిభాయి జయంతి నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మీభాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గణేశ్, శివకుమార్, ఉదయ్, వాసు, నరేశ్, రాజ్‌కుమార్, మానస, సౌజన్య, రితిక తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్, నవంబర్19: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సుల్తానాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. కరీంనగర్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్ ఝాన్సీరాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివేకానంద కళాశాల చైర్మన్ రవి, ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ రిషి, నాయకులు వినయ్, సిద్ధార్థ, అభిషేక్, అనిల్, కుమార్ ఉన్నారు.

జూలపల్లి, నవంబర్ 19 : ఏబీవీపీ ఆధ్వర్యంలో జూలపల్లిలో 'స్త్రీ శక్తి దివస్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ (ఎస్ఎఫ్‌సీ) జిల్లా కన్వీనర్ సందనవేని ఓమేశ్, గంగిపెల్లి అఖిల్, హరీశ్, వినయ్, పూజిత, మానస, రజిత, రోహిత పాల్గొన్నారు.

## నేడు శ్రీలక్ష్మినృసింహస్వామి రథోత్సవం

పెద్దపల్లి రూరల్, నవంబర్ 19: దేవునిపల్లిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి జాతర బుధవారం రథోత్సవంతో ముగియనుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈవో ముద్దసాని శంకరయ్య, చైర్మన్ సదయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వేడుకలకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నారు.

## మంథని మార్కెట్ తరలింపునకు చర్యలు

పెద్దపల్లి, నవంబర్19: మంథనిలోని మార్కెట్‌ను తాత్కాలికంగా తరలించేందుకు అవసరమైన అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు సూచించారు. మంథని మున్సిపాలిటీపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. మంథనిలో ప్రస్తుతం మార్కెట్ యార్డు ఉన్న చోట సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. దీని కోసం మార్కెట్‌ను తాత్కాలికంగా తరలించేందుకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలన్నారు.పారిశుధ్య పనులను నిత్యం నిర్వహించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, పంచాయతీ రాజ్ ఈఈ గిరీశ్ బాబు, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

**విద్యా ప్రమాణాల పెంపునకు కృషి**

పెద్దపల్లి రూరల్, నవంబర్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. రాఘవాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులుగా విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా బోధించాలని, జిల్లా ప్రత్యేకతను చాటేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు హెచ్ఎంలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీలు

పెద్దపల్లి కమాన్, నవంబర్ 19 : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలోని కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థినులకు మంగళవారం రంగోలి, మెహందీ పోటీలు నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ ఈర్ల స్వరూప, ఇన్‌చార్జి కార్యదర్శి కే కరుణకుమారి, క్లస్టర్ సీఆర్పీ బాలసాని వెంకటేశం పాల్గొన్నారు.

## డేటా సైన్స్‌తో ఉజ్వలభవిష్యత్

పెద్దపల్లి రూరల్, నవంబర్ 19: డేటా సైన్స్‌తో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టాస్క్ రిసోర్స్ పర్సన్ హేమంత్‌కృష్ణ అన్నారు. పెద్దబొంకూర్‌లోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ వర్క్ షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. పలువురు డేటా సైన్స్ ఉపయోగాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఏవో పవన్ కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖలో అవినీతి చేప

- **ఇసుక ట్రాక్టర్ విడిచిపెట్టేందుకు అంతర్గాం తహసీల్దార్ రమేశ్ కక్కుర్తి**
- **రూ.12వేల లంచం డిమాండ్**
- **ఆర్ఐ ద్వారా తీసుకుంటుండగా ఏసీబీ అధికారుల దాడి**
- **రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరార్, తహసీల్దార్ అరెస్ట్.. రిమాండ్**

అంతర్గాం, నవంబర్ 19: రెవెన్యూ శాఖకు చెందిన ఓ అవినీతి చేప ఏసీబీకి చిక్కింది. ఇసుక ట్రాక్టర్ విడిచిపెట్టేందుకు ₹12వేలు డిమాండ్ చేసి, మంగళవారం అడ్డంగా దొరికిపోయింది. బాధితుడి నుంచి డబ్బులు తీసుకున్న ఆర్ఐ పరారు కాగా, లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్ రమేశ్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయడం, అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో కలకలం రేపింది. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండానికి చెందిన ఆలకుంట మహేశ్ తన ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుక తరలించడంతో మూడు రోజుల కింద పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దీంతో మహేశ్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి, జరిమానా చెల్లిస్తా తన ట్రాక్టర్ అప్పగించాలని కోరగా, తహసీల్దార్ రమేశ్ రూ.50వేలు డిమాండ్ చేశారు. అన్ని డబ్బులు తాను ఇచ్చుకోలేనని చెప్పడంతో చివరకు రూ.25వేలు ఇస్తే వదిలిపెడుతామని తాసీల్దార్ చెప్పారు. దీంతో విసుగు చెందిన మహేశ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో అధికారులు బాధితుడికి ఒక రహస్య కెమెరా ఇచ్చి ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం తాసీల్దార్ వద్దకు పంపించారు. చివరకు రూ.12వేలు ఇస్తే వదిలిపెడుతామని తాసీల్దార్ రమేశ్ తేల్చిచెప్పాడు. అందుకు మహేశ్ కూడా సరేనని చెప్పాడు. ఈ మాటలన్నీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అనుకున్నట్లుగా మంగళవారం మహేశ్ రూ.12వేలు తీసుకొని తాసీల్దార్ వద్దకు వెళ్లాడు. ఆ డబ్బులు ఆర్ఐ శ్రీధర్‌కు ఇవ్వాలని తహసీల్దార్ చెప్పడంతో మహేశ్ వెళ్లి ఆర్ఐకి ఇచ్చాడు. అదే టైంలో ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించగా, గమనించిన ఆర్ఐ వెంటనే ఆ డబ్బులను బయట పడేసి అక్కడి నుంచి పరారైనట్లు డీఎస్పీ తెలిపారు. లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న ఆర్ఐని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

## పోస్టర్ విడుదల

సుల్తానాబాద్ రూరల్, నవంబర్ 19: ఈ నెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా పల్లెపల్లెకు ముదిరాజ్ జెండా.. ముదిరాజ్ గుండెల్లో చైతన్య ఎజెండా వినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్లను పూసాలలోని పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, నాయకులు కుమార్ బాబు, కుందేళ్ల శ్రీనివాస్, రవీందర్, శ్రీకాంత్, వినయ్, భారత్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

## ఎస్‌వోటు జీఎంకు సన్మానం

గోదావరిఖని, నవంబర్ 19: సింగరేణి ఆర్జీ-1కు ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్ఓటు జీఎం గోపాల్‌సింగ్‌ను మంగళవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సన్మానించారు. ఇక్కడ ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేశ్, సంకె అశోక్, రంగు శ్రీనివాస్, సతీశ్‌బాబు, గండి ప్రసాద్, సోహెల్, నాయిని శంకర్‌రెడ్డి, వెంకటస్వామి, ప్రభుదాస్, అజీం ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన

రామగిరి, నవంబర్ 19: కల్వచర్ల ఐకేపీ సెంటర్‌ను అదనపు కలెక్టర్ వేణు మంగళవారం పరిశీలించారు. మొదటిసారి తహసీల్దార్ కార్యాలయానికి రాగా, తాసీల్దార్ రాంచందర్ రావు, సిబ్బంది సన్మానించారు. అనంతరం సుందిళ్ల లక్ష్మీ నృసింహస్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మానస ఉన్నారు.

కమాన్‌పూర్, నవంబర్ 19 : మండల కేంద్రంలోని సెర్ఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వేణు సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ వాసంతి ఉన్నారు.

## ఓసీపీ-3లో డీ-గ్రేడ్ ఆపరేటర్ల నిరసన

యైటింక్లయిన్‌కాలనీ, నవంబర్ 19 : ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో సీ-గ్రేడ్ ప్రమోషన్ అమలు చేయాలని డీ-గ్రేడ్ ఆపరేటర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మంగళవారం ప్రాజెక్టు ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ డిమాండ్లను అమలు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. ఆపరేటర్లు మల్లేశ్, తిరుపతి రెడ్డి, గుర్రం రవి, కన్నెబోయిన సదానందం, విజయ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు ఆటల పోటీలు

పెద్దపల్లి కమాన్, నవంబర్ 19 : జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బీసీ వసతి గృహ విద్యార్థులకు పెద్దపల్లిలోని ఇండియన్ మిషన్ స్కూల్‌లో జిల్లా స్థాయి ఆట పోటీలు నిర్వహించారు. డీఈవో మాధవి హాజరై పోటీలను ప్రారంభించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని డీఈవో తెలిపారు.

## మైక్ సెట్ వితరణ

ఓదెల, నవంబర్ 19: మాజీ వైస్‌ఎంపీపీ పల్లె కుమార్‌గౌడ్ జ్ఞాపకార్థం అతని చెల్లెలు ధనలక్ష్మి ఓదెలలోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మైక్ సెట్ వితరణ చేశారు. మంగళవారం గౌడ సంఘ నాయకులకు అందజేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు నాగపూరి రవి, మహేందర్, స్వామి, పర్శరాం, అనిల్ ఉన్నారు.

## పరామర్శ

సుల్తానాబాద్ రూరల్, నవంబర్ 19: సుల్తానాబాద్‌కు చెందిన ఆరెపల్లి జితేందర్ అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్‌ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జితేందర్ మృతదేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నాయకులు తోట వెంకటేశ్ పటేల్, మాచర్ల బబ్లూ, ఆముదాల అరుణ, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, నవంబర్ 19: పట్టణంలో పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విజయరమణారావు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని శాంతినగర్, రంగంపల్లి పరిధిలోని 3,10, 22 వార్డుల్లో రూ.1.32 కోట్లతో డ్రైనేజీ, సీసీ రోడ్డుతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాన చేశారు. పనుల్లో నాణ్యత పాటించి, త్వరగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ ఎంపీపీలు సారయ్యగౌడ్, సునీతా-రాజేందర్, సీనియర్ నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, సయ్యద్ మస్రత్, కౌన్సిలర్లు గాదె మాధవి, లైశెట్టి భిక్షపతి, ఉప్పు స్వరూప-రాజు, తూముల సుభాష్ రావు, నూగిల్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, నాయకులు పూదరి మహేందర్, తిరుపతి, ఎడెల్లి శంకర్, వేముల రాజు, బంక అశోక్, రవి, సాయి పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ఈశ్వర్‌ను కలిసిన నాయకులు

ధర్మారం ,నవంబర్ 19: మున్నూరు కాపు సంఘం నాయకులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కరీంనగర్‌లో మంగళవారం కలిశారు. ఇటీవల నూతనంగా మండల కమిటీని ఎన్నుకోగా కమిటీ సభ్యులు ఈశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం ఈశ్వర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు తన్నీర్ రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొత్త మోహన్, కోశాధికారి ఆడవాల రవి, నాయకులు పాల్గొన్నారు.

## పరామర్శ

గోదావరిఖని, నవంబర్ 19: 32వ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గడమల శంకర్ సోదరుడు గడమల్ల కుమారస్వామి మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి ఓదార్చారు. అంతకుముందు చందర్ కుమారస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళర్పించారు. నాయకులు నారదాసు మారుతి, మెతుకు దేవరాజ్, కోడి రామకృష్ణ, కొప్పుల రాజనర్సు, శ్రావణ్, నర్సింగ్, సదానందం ఉన్నారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 19: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన కే లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. బాధిత కుటుంబానికి రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ రూ.8లక్షల భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును కమిషనరేట్ కార్యాలయంలో అతని భార్య శంకరమ్మకు సీపీ చెక్కు అందజేశారు. వారి కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, సూపరింటెండెంట్ సంధ్య, జూనియర్ అసిస్టెంట్ నజియా ఇరామ్ ఉన్నారు.

## మాతృ మరణాలను తగ్గించాలి

- **డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి**

పెద్దపల్లి, నవంబర్19: జిల్లాలో మాతృ మరణాలను తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి ఆదేశించారు. మాతృ మరణాలపై కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగిన నాలుగు మాతృ మరణాలపై సమీక్షించి, మాతృ మరణాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ కే శ్రీధర్, ప్రోగ్రాం ఆఫీసర్ (ఎంహెచ్ఎన్)బీ వాణిశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరామ్, వైద్యులు సదానందం, రమణ, స్రవంతి, కిరణ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.